క్లుప్తంగా

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు (కిలో.. రూపాయలో) టమాట 20–25, పచ్చిమిర్చి 80, బెండ 60, కాకర 50, దొండ 50, దోస 50, ఆలు 20–25, చామ 80, కీర 30, బీర 50–60, వంకాయ 30–40, గోకర 50–60, బీన్స్ 80, బీట్‌రూట్ 30, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 20, క్యారెట్ 30, చిక్కుడు 60, ఉల్లి 100 (4–5 కేజీలు), మునక్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 30, అల్లం 100, వెల్లుల్లి 140.

ఉత్సాహంగా వాకథాన్



రాయదుర్గం: లింగసమానత్వాన్ని వేడుక చేస్తూ 'వాకథాన్' కార్యక్రమం నిర్వహించారు. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని ఏడీపీ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ వాకథాన్‌లో 400 మంది అసోసియేట్లు పాల్గొన్నారు. ఇందులో 60 శాతం మంది మహిళలు పాల్గొనడం మరో విశేషం. ఏడీపీ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్,హెడ్ ఆఫ్ హెచ్‌ఆర్ డాక్టర్ విపుల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కవితను దూషించినవారిపై చర్యలు తీసుకోవాలి



రాయదుర్గం ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

రాయదుర్గం: బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్‌ఎస్ గచ్చిబౌలి డివిజన్ నాయకులు రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ మహేష్‌ను బీఆర్‌ఎస్ నాయకులు శ్యామ్లెట్‌శ్రీనివాస్, రమేష్‌గౌడ్, అంజమ్మ, బాలమణితోపాటు పలువురు నాయకులు కలిసి వినతిపత్రాన్ని అందించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే



గచ్చిబౌలి: ఆస్పత్రులలో చికిత్స పొందుతున్న వారికి వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సోమవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ చేశారు. కొండాపూర్ డివిజన్ పరిధిలోని మార్తాండనగర్‌కు చెందిన సయ్యద్ మియాకు రూ.రెండు లక్షలు, శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని లింగంపల్లికి చెందిన అరుణకు రూ. మూడున్నర లక్షల చెక్‌లను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఇంద్రారెడ్డి ఆల్విన్‌కాలనీ నూతన కార్యవర్గం

హఫీజ్‌పేట్: ఇంద్రారెడ్డి ఆల్విన్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేసన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ మేరకు సోమవారం అసోసియేషన్ ప్రతినిధులు ఒక ప్రకటన విడుదల చేశారు. నూతన అధ్యక్షులుగా దామెదర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు, కార్యదర్శిగా వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా నర్సింగ్ రావు, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శిగా శ్రీనివాసరావు, కోశాధికారిగా సాంబశివారెడ్డి, లీగల్ సెక్రెటరీగాశ్యాముల్ ఎన్నికయ్యారు.

రెండు మీటర్ల స్థలం వదలి ఫెన్సింగ్ వేయండి



జోనల్ మేనేజర్ అనూరాధతో మాట్లాడుతున్న కార్పొరేటర్ మెట్టు కుమార్

పటాన్‌చెరు టౌన్: ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని బండ్లగూడలో టీఎస్‌ఐఐసీ ఐలా వేస్తున్న ఫెన్సింగ్‌ను రెండు మీటర్ల స్థలం వదిలి వేయాలని పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. టీఎస్‌ఐఐసీ ఫెన్సింగ్ వేయడం వల్ల బండ్లగూడలో రోడ్డు పూర్తిగా చిన్నగా మారడంతో పాటు డ్రైనేజీ నిర్మాణం, వీధి దీపాల కోసం విద్యుత్ స్తంభాలు వేయడానికి ఇబ్బందిగా మారుతుందని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో స్పందించిన కార్పొరేటర్ బండ్లగూడవాసులతో కలసి టీఎస్‌ఐఐసీ కార్యాలయానికి వెళ్లి జోనల్ మేనేజర్ అనూరాధ, డిప్యూటీ జోనల్ మేనేజర్ భవానీలను కలిశారు.

ఎస్కీ..సూపర్

పనితీరుకు జాతీయ స్థాయి గుర్తింపు

- ఇప్పటి వరకు ప్రతిష్టాత్మకమైన 8 గోల్డెన్ పీకాక్ అవార్డులు
- వరుసగా మూడవ ఏడాదీ అవార్డు
- శిక్షణ కార్యక్రమాల నిర్వహణలో దేశంలోనే అత్యంత ఆదరణ



ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా ప్రధాన భవనం



దుబాయిలో అవార్డు స్వీకరిస్తున్న ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు (ఫైల్)

రాయదుర్గం: శిక్షణా కార్యక్రమాలు....అత్యున్నత నాణ్యతాప్రమాణాలతో కోర్సుల నిర్వహణలో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఎస్కీ). అత్యుత్తమ శిక్షణ ఇవ్వడంతో గోల్డెన్ పీకాక్ అవార్డులను సొంతం చేసుకుంటూ వస్తోంది. 2023 సంవత్సరానికి కూడా ఎస్కీని ఈ అవార్డు వరించింది. ఇటీవల ఈ అవార్డును 'ఎస్కీ' డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు దుబాయిలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును స్వీకరించడం విశేషం. ప్రతియేటా 'ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ ఇండియా' గోల్డెన్ పీకాక్ అవార్డును అందజేస్తోంది. ప్రతి సంవత్సరం న్యూఢిల్లీలో ఇచ్చే ఈ అవార్డును ఈ ఏడాది దుబాయిలో ఇవ్వడం విశేషం. ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు 8సార్లు ఈ గోల్డెన్ పీకాక్ అవార్డులను సాధించడం విశేషం.

- ఎస్కీ గోల్డెన్ పీకాక్ అవార్డును 2007, 2008, 2010, 2011, 2012, 2021, 2022 సంవత్సరాలలో పొందింది. తాజాగా 2023లో కూడా ఈ అవార్డును పొందడం విశేషం.
- 2021,2022,2023 వరుసగా మూడేళ్ళపాటు అవార్డును 'ఎస్కీ' పొందడం సంస్థ పనితీరుకు నిదర్శనం.

'ఎస్కీ' గురించి..

- 1981లో గచ్చిబౌలిలో 70 ఎకరాల విశాల స్థలంలో ఏర్పాటు
- కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాల అధికారులు, ప్రైవేటు సంస్థల వారికి కూడా వృత్తి నైపుణ్యం పెంచుకోవడానికి ఏడాది పొడవునా శిక్షణా కార్యక్రమాలను నిర్వహస్తూ వస్తుంటారు.
- ఎస్కీలో నిర్వహించే కోర్సులు ఏఐసీటీఈ గుర్తింపు
- ఎస్కీలో విద్యాభివృద్ధి కోసం బిజినెస్ స్కూల్‌ను ఏర్పాటు చేసి దానికి స్కూల్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ స్టడీస్‌గా నామకరణం.
- ప్రస్తుతం పీజీ డిప్లొమా రెండేళ్ళ కోర్సులను నిర్వహిస్తోంది.
- ఎస్కీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైవేటు సంస్థల ఇంజనీర్లు, మేనేజర్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం ప్రధాన లక్ష్యంగా కొనసాగుతోంది

ఈ అవార్డు సమష్టి కృషికి నిదర్శనం



'ఎస్కీ' సంస్థలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సమిష్టి కృషి, పనితీరుకు అవార్డు రావడమే నిదర్శనం. నా హాయాంలో ఇది మూడవ గోల్డెన్ పీకాక్ అవార్డు. రాబోయే రోజుల్లో 'ఎస్కీ'ని మరింతగా అభివృద్ధి పర్చి అనేక రకాల ప్రణాళిక లతో ముందుకు సాగుతాం. 8 అవార్డులు రావడంతో మా బాధ్యత మరింత పెరిగింది.

- డాక్టర్ జి. రామేశ్వరరావు డైరెక్టర్ ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా

'మనూ'లో ఆకట్టుకున్న కార్యక్రమాలు



ఉర్దూ విశ్వవిద్యాలయంలో విద్యార్థుల ప్రదర్శన

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని డ్రామా క్లబ్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ విమెన్ ఎడ్యుకేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. క్యాంపస్‌లోని యాంపీథియేటర్‌లో ఇగ్నైటెడ్ మైండ్స్–ఓపెన్ మైక్ పేరిట ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఇది క్యాంపస్‌లో నిర్వహించిన అయిదవ ఓపెన్ మైక్ ప్రోగ్రామ్. దీంట్లో మొత్తం 12 మంది విద్యార్థులు పాల్గొని కథలు, కవిత్వం, గజల్, మైమ్, మోనోయాక్ట్, యూనివర్శిటీ డ్రామా క్లబ్ ద్వారా ప్రత్యేక ప్రదర్శనతో సహా అనేక రకాల ప్రతిభను ప్రదర్శించారు. కల్చరల్ కోఆర్డినేటర్ మెరాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

కార్పొరేటర్లతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం

మియాపూర్ : మియపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కార్పొరేటర్లతో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అకాల వర్షాల నేపథ్యంలో వరదముప్పు ప్రాంతాలను గుర్తించి వెంటనే నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఆయా డివిజన్ల నుండి కాలనీ, బస్తీలలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల ప్రతిపాదనలను పంపించాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, జగదీశ్వర్‌గౌడ్, నార్నె శ్రీనివాస్ పాల్గొన్నారు.

'మెడికవర్'లో ఇంటర్నేషనల్ ఓరల్ హెల్త్ డే



కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్లు, చిన్నారులు

మాదాపూర్: చిన్న పిల్లలు నోటిని ఆరోగ్యంగా , శుభ్రంగా ఉంచుకుంటే చాలా వరకు రోగాలు దూరమవుతాయని దంతవైద్య నిపుణులు డాక్టర్ శరత్‌బాబు తెలిపారు. మాదాపూర్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో చిన్నపిల్లల్లో ఆరోగ్య సమస్యలపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక ఆరోగ్యానికి నోరు పరిశుభ్రంగా ఉండడం ఎంతో అవసరమన్నారు. పెద్దవాళ్ళలో చిగుళ్ళవ్యాధికి హార్ట్‌అటాక్, డయాబెటీస్ లాంటి వ్యాధులకు సంబంధం ఉందని పరిశోధకులు వెల్లడిస్తున్నారన్నారు.

బీజేపీలోకి భారీగా యువకుల చేరికలు



హఫీజ్‌పేట్ : కొండాపూర్ డివిజన్ పరిధిలోని బీజేవైఎం అధ్యక్షులు నవీన్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం బీజేపీలో భారీగా యువకులు బీజేపీ పార్టీలో చేరారు. వారికి రాష్ట్ర నాయకులు రవికుమార్ యాదవ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే నియోజకవర్గాన్ని అవినీతి, అక్రమాలకు, భూకబ్జాలకు అడ్డాగా మార్చారని అన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి చేసింది, ప్రజలకు సేవ చేసేది భిక్షపతి యాదవ్ మాత్రమేనన్నారు. బీజేపీ పార్టీ నాయకులు రాధాకృష్ణ యాదవ్, ఎల్లేష్ పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక

గచ్చిబౌలి: కొండాపూర్ డివిజన్‌కు చెందిన పలువురు బీజేపీలో చేరారు. బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి రఘునాథ్‌యాదవ్ ఆధ్వర్యంలో పలువురికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కాషాయ జెండా ఎగరడం ఖాయమని రఘునాథ్ యాదవ్ పేర్కొన్నారు. డివిజన్ యువ మోర్చా నాయకులు అరుణ్ పటేల్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలన అధ్వానం



నిరసన దీక్షలో బీజేపీ నరేందర్‌రెడి, నందీశ్వర్‌గౌడ్ శ్రీకాంత్ గౌడ్ తదితరులు

పటాన్‌చెరు టౌన్: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పాలన అధ్వానంగా మారిందని, నిరుద్యోగులకు న్యాయం జరగడం లేదని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌గౌడ్ విమర్శించారు. సోమవారం పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో టీఎస్‌పీఎస్‌సీ అక్రమాలపై సిట్టింగ్‌జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్ గౌడ్, మహిళ మోర్చా రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి గోదావరి అంజిరెడ్డి నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ మంత్రులకు కేంద్రంపై తప్పుడు ప్రచారాలు చేసే దానిపై ఉన్న శ్రద్ధ యువత భవిష్యత్‌పై ఏ మాత్రం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి బైండ్ల కుమార్, నాయకులు సహదేవ్, నరేష్, ఆనంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నోటి ఆరోగ్యమే సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న డాక్టర్ రాము

పటాన్‌చెరు టౌన్: నోటి ఆరోగ్యం సాధారణ ఆరోగ్యంతో ముడిపడి ఉంటుందని, జీవన నాణ్యతను (శారీరక, సామాజిక, మానసిక) ప్రభావితం చేస్తుందని దంత వైద్యుడు డాక్టర్ రాము సోముల అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీలో సోమవారం నిర్వహించిన ప్రపంచ నోటి ఆరోగ్యం దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రుద్రారం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఓరల్ హెల్త్ అవేర్‌నెస్ క్యాంపుతో పాటు గీతం ఫార్మసీ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. నోటి నుంచి వచ్చే బ్యాక్టీరియా నేరుగా లాలాజలం, రక్తం ద్వారా గుండెలోకి ప్రవేశిస్తుందని, దీనివల్ల గుండెల్లో మంట వస్తుందని, దీనిని బాక్టీరియల్ ఎండోకార్డిటిస్ అంటారన్నారు. అధిక మద్యసేవనం, మాదకద్రవ్యాల వినియోగం, ధూమపానం దంతక్షయాన్ని పెంచుతుందన్నారు. ఇది కొన్నిరకాల నోటి కేన్సర్‌కు దారి తీస్తుందన్నారు. సమన్వయకర్త డాక్టర్ సీహెచ్. పవన్‌కుమార్ పాల్గొన్నారు.



విపత్తు నిర్వహణపై శిక్షణ

రాయదుర్గం: భారతదేశం పెద్ద దేశమేకాకుండా వైవిధ్యభరితంగా ఉండటం వల్ల అనేక సమస్యలు కూడా ఉంటాయని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో విపత్తు నిర్వహణపై టర్మ్‌కోర్సును యూజీసీ మానవ వనరుల అభివృద్ధి కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన కోర్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విపత్తు నిర్వహణ కోర్సులు ప్రతి ఒక్కరూ తెలుసుకోవడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. యూజీసీ హెచ్‌ఆర్‌డీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ ననీమ్ ఫాతిమా పాల్గొన్నారు.

సంపులో పడి ఓ యువతి మృతి

మియాపూర్ : ఓ యువతికి మూర్ఛరావడంతో సంపులో పడి మృతిచెందిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ గిరీష్ తెలిపిన మేరకు.. సూర్యాపేట జిల్లా గాంధీనగర్‌లోని బాచనాయక్‌తండాకు చెందిన లునావత్ నిర్మల(26) మియాపూర్‌లోని మయూరినగర్ స్వదర్ గృహ అనాథాశ్రమంలో ఉంటుంది. నిర్మల మూర్ఛవ్యాధితో బాధపడుతుండేది. సోమవారం ఉదయం బ్రష్ చేసుకుంటూ ఉండగా మూర్ఛ రావడంతో అనాథాశ్రమ ప్రాంగణంలో ఉన్న సంపులో పడిపోయింది. ఎవరూ చూడకపోవడంతో అందులో మునిగి మృతిచెందింది. కొద్దిసేపటి తర్వాత నిర్మల ఆశ్రమంలో కనిపించకపోవడంతో నిర్వాహకులు వెతకగా సంపులో కనిపించింది. బయటకు తీయగా అప్పటికే మృతిచెంది ఉంది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు 'మనూ'లో ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమం

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్షియన్, సెంట్రల్ ఏషియన్ స్టడీస్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు డీపీ అండ్ సీఏఎస్ హెడ్ డాక్టర్ సయ్యద్ అస్మత్‌జహాన్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సయ్యద్ హమీద్ లైబ్రరీ ఆడిటోరియంలో జరిగే ఈ కార్యక్రమంలో ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమం లో ప్రముఖ ఉర్దూ, పర్షియన్ విమర్శకుడు, కెనడాకు చెందిన డాక్టర్ సయ్యద్ తకీ ఆబేదీ పాల్గొంటార న్నారు.

నేడు ప్రపంచ నీటి దినోత్సవం

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ప్రపంచ నీటి దినోత్సవాన్ని (డబ్లూడబ్ల్యూడీ) పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమాలను మంగళవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. క్యాంపస్‌లోని ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో నీటిపై డాక్యుమెంటరీ ఫిల్మ్ ప్రదర్శించడానికి కూడా ఏర్పాట్లు చేశారు. మనూ జల్‌శక్తి అభియాన్ స్కూల్ ఆఫ్ సైన్సెస్ చూర్మన్ ప్రొఫెసర్ షకీల్ అహ్మద్‌ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి సాయంత్రం 4.30 గంటలకు వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్ ప్రారంభిస్తారు.

శిల్పారామంలో ఉగాది ఉత్సవాలు

మాదాపూర్: మాదాపూర్‌లో ఉగాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్టు శిల్పారామం ప్రత్యేక అధికారి జి.కిషన్‌రావు సోమవారం తెలిపారు. ఈనెల 22వ తేదీన శోభకృత్‌నామ సంవత్సరం ఉగాది ఉత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం నుండి సాయంత్రం వరకు వచ్చిన సందర్శకులకు ఉగాది పచ్చడి వితరణ చేయనున్నట్టు తెలిపారు. సాయంత్రం ప్రముఖ కవి, సంపాదకులు శ్రీసాగి కమలాకర శర్మ పంచాంగ శ్రవణం ఉంటుందన్నారు.

ఘనంగా శ్రీ సాయిబాబా దేవాలయ వార్షికోత్సవ వేడుకలు

మియాపూర్ : మియాపూరిర్ డివిజన్ పరిధిలోని హెచ్‌ఎంటీ స్వర్ణపురికాలనీ శ్రీ సాయి బాబా దేవాలయంలో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబాను ప్రత్యేకంగా పలు రకాల పూలతో అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ హాజరయ్యారు.

ఉగాది నవరాత్రోత్సవాలకు భారీగా ఏర్పాట్లు



శేరిలింగంపల్లి: ఉగాది పర్వదినం శోభకృత్ నామ సంవత్సరాన్ని పురస్కరించుకొని బెల్ ఎంఐజీ కాలనీలోని రామాలయంలో ఉగాది నవరాత్రోత్సవాలను భారీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 22వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఈ ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఉగాది పర్వదినం నుంచి శ్రీరామనవమి పర్వదినం వరకు ఈ ఉత్సవాలు సాగుతాయి. ఏర్పాట్లను ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

ఉత్సాహంగా 'సిల్వర్ జూబ్లీ గేట్' ప్రారంభం



ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం సిల్వర్ జూబ్లీ వేడుకల్లో భాగంగా నూతనంగా క్యాంపస్‌లో నిర్మాణం చేయించిన 'సిల్వర్ జూబ్లీ గేట్'ను ప్రారంభించారు. సోమవారం సాయంత్రం క్యాంపస్‌ను రెండవ ప్రవేశ మార్గాన్ని ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ ప్రారంభించారు. ఈ గేట్‌కు 'బాబ్–ఇ–ఇల్మ్'(గేట్ ఆఫ్ నాలెడ్జ్) అని నామకరణం చేయడం మరో విశేషం. ప్రస్తుతానికి యూనివర్శిటీకి చేరుకోవడానికి ఒకటే ప్రధాన ద్వారం ఉండేది. ప్రస్తుతం సిల్వర్ జూబ్లీ గేట్ నిర్మాణంతో రెండవ గేటు ప్రారంభించడం రెండవ గేటు అందుబాటులోకి వచ్చినట్లయింది.

వెంకటేశ్వరస్వామి దేవాలయంలో కవి సమ్మేళనం

మియాపూర్ : శ్రీ శోభకృతీ నామ సంవత్సర ఉగాది పండుగను పురస్కరించుకుని చందానగర్‌లోని వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఫ్రెండ్స్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో కవి సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైద్రాబాద్ యూనివర్సిటీ తెలుగుశాఖ ఆచార్యులు దేవారెడ్డి విజయలక్ష్మి హాజరై మాట్లాడుతూ... శుభకృత్ నుండి శోభకృతీలోకి ప్రవేశించిన మనందరికి శోభాయమాన జీవితాన్ని ప్రసాదించమని ఆ దేవున్ని ప్రార్థిస్తూ అందరికి ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. 30 సంవత్సరాలుగా స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ రామస్వామి యాదవ్‌ను ఆమె అభినందించారు.

అకాల వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి



ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఎడతెరిపి లేకుండా అకాలంగా కురిసిన భారీ వర్షం కారణంగా ముంపు ప్రాంతాల్లో సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు సోమవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అకాల వర్షాల కారణంగా ముంపుకు గురైన ప్రాంతాలను పరిశీలించామన్నారు. వర్షాలతో రోడ్లపై పేరుకుపోయిన మట్టిని తొలగించాలని పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశించారు. ఆల్విన్ కాలనీ ఫేజ్2లో ఖాళీ స్థలాన్ని పార్కు కోసం వినియోగించుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. విషజ్వరాలు బారిన పడకుండా ప్రజలు ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మాన్‌సూన్, ఎమర్జెన్సీ టీమ్‌లు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. నాలాలో పేరుకుపోయిన మట్టి, చెత్తాచెదారాన్ని తొలగించాలని ఆదేశించారు. నాలాల చుట్టూ ఫెన్సింగ్ వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్విన్‌కాలనీ డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, నాయకులు రాజేష్‌చంద్ర, కాశీనాథ్‌యాదవ్, శివరాజ్‌గౌడ్, కృష్ణారావు, వెంకటేష్‌గౌడ్, కట్టా శ్రీనివాస రావు, షౌకత్ అలీ మున్నా, పోశెట్టిగౌడ్, సంతోష్, బిరాదర్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాన్ని పార్కుగా తీర్చిదిద్దాలి

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ డివిజన్ మలేషియన్ టౌన్‌షిప్ వెనుక గ్రౌండ్‌ను కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సోమవారం కార్పొరేటర్ల మందడి శ్రీనివాసరావు, పగుడాల శిరీష బాబురావులతో కలసి పరిశీలించారు. గ్రౌండ్ చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణం పూర్తి చేసి పక్కనే ఉన్న ఖాళీ స్థలాన్ని పార్కుగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. అనంతరం జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం వికలాంగుల కాలనీని పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలించి కమ్యూనిటీహాల్ నిర్మించాలని సూచించారు. లీకేజీ అవుతున్న ఇళ్లకు మరమ్మతు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు ఈఈ సత్యనారాయణ, డీఈ ఆనంద్ పాల్గొన్నారు.

- **శ్మశానవాటిక నిర్మాణ పనుల పరిశీలన**

అల్లాపూర్‌లో నిర్మిస్తున్న హిందూ శ్మశానవాటిక పనులను కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సోమవారం స్థానిక కార్పొరేటర్ సబిహా బేగంతో కలిసి పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంతరం ముల్లకత్వ చెరువును పరిశీలించి చెరువు సుందరీకరణ పనులకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

- **క్యాంపు కార్యాలయంలో...**

కూకట్‌పల్లి నియోజకవర్గంలోని పలు డివిజన్లకు సంబంధించి షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్లు సబిహా బేగం, పగుడాల శిరీష, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్‌లతో లబ్ధిదారులకు సోమవారం అందజేశారు. మొత్తం 93 మందికి పంపిణీ చేశామని ఇప్పటికే కూకట్‌పల్లి నియోజకవర్గంలో దాదాపు 15 వేల మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేసినట్లు ఆయన వివరించారు. సంక్షేమ ఫలాలు నిరుపేదలకందే విషయంలో ఎక్కడా రాజీ పడకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. నిరుపేదలకు ఉపయోగపడే పథకాలను ప్రవేశపెట్టడంలో తెలంగాణ రాష్ట్రం ముందంజలో ఉందన్నారు.